క్లుప్తంగా

కాంగ్రెస్‌కు పీఏసీఎస్ వైస్ చైర్మన్ రాజీనామా

నందిగామ: నందిగామ పీఏసీఎస్ వైస్ చైర్మన్ రజినీకాంత్ యాదవ్ కాంగ్రెస్‌కి గురువారం గుడ్‌బై చెప్పారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మాజీ జెడ్పీవైస్ చైర్మన్ నాగరకుంట నవీన్‌రెడ్డి, సీనియర్ నాయకుడు కడెంపల్లి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా నవీన్‌రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం, అంజయ్య యాదవ్ చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితుడినై బీఆర్‌ఎస్‌లో చేరినట్లు రజినీకాంత్ యాదవ్ తెలిపారు.

‘సదర్’ సంబురం

ఇబ్రహీంపట్నం: యాదవ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి ఇబ్రహీంపట్నంలో అంబేడ్కర్ చౌరస్తాలో సదర్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. సంబురంగా నిర్వహించిన వేడుకల్లో యాదవులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పట్నం వీధుల గుండా సదర్ ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా దున్నపోతుల విన్యాసాలు, యువకుల నృత్యాలు సదర్ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అంతకుముందు దున్నరాజులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమ కులదేవతలను వేడుకుంటూ ఆడిన ఆటపాటలు, డిల్లెం బల్లం అందరిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాలు సంఘం నాయకులు మంగల్‌పల్లి యాదయ్య, అందెల బాలయ్య, ముంత జంగయ్య, యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు బర్ల జగదీశ్, యాదవ సంఘం పట్టణ అధ్యక్షుడు నక్క శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు లింగం, గౌరవ అధ్యక్షుడు కసరమోని మల్లేశ్, చింతం బాల్‌రాజ్, ముసలయ్య, నరహరి తదితరులు పాల్గొన్నారు.

పీసీసీ అధికార ప్రతినిధిగా బాలాజీసింగ్

ఆమనగల్లు: పీసీసీ అధికార ప్రతినిధిగా నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్ చైర్మన్ ఠాగూర్ బాలాజీసింగ్‌ను నియమించారు. ఈ మేరకు పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి నియామక ఉత్తర్వులను బాలాజీసింగ్‌కు అందజేశారు. అనంతరం ఆయనను కల్వకుర్తి కాంగ్రెస్ పార్టీ నాయకులు గుర్రం కేశవులు, జంగయ్య ఘనంగా సత్కరించారు.

నేడు సబితారెడ్డి ఎన్నికల ప్రచారం

కందుకూరు: మండల పరిధిలో తొమ్మిది గ్రామాల్లో శుక్రవారం బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి సబితారెడ్డి ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నట్లు జెడ్పీటీసీ జంగారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటలకు మాదాపూర్‌లో ప్రారంభమై.. కొలన్‌గూడ, గుమ్మడవెల్లి, ఆకులమైలారం, మీర్‌ఖాన్‌పేట, బేగరికంచె, అన్నోజిగూడ, గూడూరు, కటికపల్లి గ్రామాల్లో ప్రచారం కొనసాగనుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రోడ్డుకు మరమ్మతులు



మంగళపల్లి-చెన్నారం రోడ్డు

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం మంగళపల్లి గ్రామం నుంచి తలకొండపల్లి మండలం చెన్నారం గ్రామానికి వెళ్లే మట్టిరోడ్డును అనూష ప్రాజెక్ట్ ప్రైవేటు లిమిటెడ్ ఎండీ జలంధర్‌రెడ్డి సహకారంతో మరమత్తు పనులు చేపట్టారు. రోడ్డుపై గుంతలు ఏర్పడడంతో రాకపోకలు ఇబ్బందిగా మారింది. జలందర్‌రెడ్డి సహకారంతో దాదాపు 4 కిలోమీటర్ల రోడ్డుకు మరమత్తు పనులు చేపట్టారు. పనులను గురువారం వైస్ ఎంపీపీ అనంతరెడ్డి, స్థానిక నాయకులు పరిశీలించారు.

ఆర్థిక సహాయం

ఇబ్రహీంపట్నం: రాయపోల్ గ్రామానికి చెందిన ల్యాబ్ టెక్నిషియన్ నాంపల్లి బానుచందర్ (32) గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గ్రామీణ వైద్యులు, ల్యాబ్ టెక్నిషియన్ అసోసియేషన్ సభ్యులు గురువారం గ్రామానికి వెళ్లి మృతుడి కుటుంబాన్ని పరామర్శించి.. రూ.38వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. భానుచందర్ కుటుంబాన్ని ఆదుకోవాలని ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి కోరారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు



మొయినాబాద్ రోడ్‌షోలో మాట్లాడుతున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



షాబాద్ నుంచి మొయినాబాద్‌కు తరలిన వాహనాలకు జెండా ఊపి ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి

పార్టీలు మారితే జనం నమ్మరు

- హత్యా రాజకీయాలకు తావులేదు
- మూడోసారి ఆశీర్వదించి గెలిపించండి
- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల/మొయినాబాద్: పార్టీలు మారే నాయకులను జనం నమ్మరని, రెండు సార్లు తనను ఎమ్మెల్యేగా గెలిపించారని, మూడో సారి ఆశీర్వదించి గెలిపించాలని చేవెళ్ల ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి కాలె యాదయ్య అన్నారు. మొయినాబాద్‌లో గురువారం మంత్రి కేటీఆర్‌తో కలిసి రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. చేవెళ్లలో హత్యా రాజకీయాలకు తావులేదన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి భీంభరత్‌పై హత్య కేసులు, ఆయుధాల కేసులు ఉన్నాయని ఆరోపించారు. నియోజకవర్గంలో భూ కబ్జాలు, సెటిల్మెంట్లు చేసేవారిని నమ్మొద్దన్నారు. బీజేపీ అభ్యర్థి రత్నం మొన్నటి వరకు బీఆర్‌ఎస్‌లోనే ఉన్న వ్యక్తని బీజేపీలోకి ఎందుకు పోయారో ఆయనకే తెలియాలన్నారు. బీజేపీ, కాంగ్రెస్ జాతీయ పార్టీలకు తెలంగాణలో స్థానం లేదన్నారు. వారికి అధికారం ఇస్తే దోచుకోవడమే తప్పా అభివృద్ధి శూన్యమన్నారు. ప్రతిఒక్కరూ కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి మహేందర్‌రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, నియోజకవర్గం ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు స్వప్న, ఎంపీపీ నక్షత్రం, జెడ్పీటీసీ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి, ఎంపీకి దక్కని అవకాశం..

మొయినాబాద్‌లో జరిగిన రోడ్‌షోలో మంత్రి మహేందర్‌రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, నియోజకవర్గం ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి పాల్గొన్నా వారికి మాట్లాడే అవకాశం దక్కలేదు. ఎమ్మెల్యే యాదయ్య, మంత్రి కేటీఆర్ మాత్రమే రోడ్ షోలో మాట్లాడారు.

షాబాద్‌లో..

షాబాద్: మొయినాబాద్‌లో మంత్రి కేటీఆర్ రోడ్‌షోకు షాబాద్ నుంచి 5వేల మందిని తరలించినట్లు షాబాద్ జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం షాబాద్ నుంచి అవినాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీగా వెళ్లే వాహనాలకు జెండా ఊపి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా బీఆర్ఎస్ ప్రభుత్వం మళ్లీ రావాలని కోరుకుంటున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ గూడూరు నర్సింగ్‌రావు, మాజీ చైర్మన్లు నక్క శ్రీనివాస్‌గౌడ్, పొన్న నర్సింహారెడ్డి, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

శంకర్‌పల్లిలో..

శంకర్‌పల్లి: శంకర్‌పల్లి మండలం, మున్సిపల్ పరిధిలోని బీఆర్ఎస్ నాయకులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. ఎమ్మెల్యే యాదయ్య విజయం ఖాయమని వారు ధీమా వ్యక్తం చేశారు. మండల ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ గోవిందమ్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ పాపారావు, వైస్ చైర్మన్ కురుమ వెంకటేశ్, పీఏసీఎస్ చైర్మన్ బద్దం శశిధర్‌రెడ్డి, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు రవిందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల: చేవెళ్ల మండలం నుంచి పెద్ద ఎత్తున బీఆర్ఎస్ శ్రేణులు తరలి వెళ్లారు. ఎంపీపీ విజయలక్ష్మి, జెడ్పీటీసీ మాలతి, మండల అధ్యక్షుడు ప్రభాకర్, నరేందర్ ఆధ్వర్యంలో తరలి వెళ్లారు. వారు మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం రావడం ఖాయమన్నారు. తోట చంద్రశేఖర్, మల్లారెడ్డి పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి

- ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం నేతలు మహేశ్, ప్రభాకర్

చేవెళ్ల: రాబోయే ప్రభుత్వాలు సామాజిక, ఆర్థిక రంగాల్లో సమానత్వం కోసం కృషి చేస్తూ, అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి మహేశ్, జిల్లా అధ్యక్షుడు బేగరి ప్రభాకర్‌లు పేర్కొన్నారు. చేవెళ్లలో గురువారం ఆ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ‘దళితులను వీడని అంటరానితనం, పరిస్థితులు మారాలి’ అవగాహన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75ఏళ్లు దాటినా కూడా ఇంకా దళితుల సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. నేటికీ అంటరానితనం రూపుమాపలేదని, అసమానతలు దూరం కావడం లేదన్నారు. ఈ ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థులు తమ సంఘం తరుపున ప్రవేశపెట్టిన పలు డిమాండ్లను అమలు చేయాలని వారు పేర్కొన్నారు. ఈ డిమాండ్లను నూతనంగా ఏర్పాటైయ్యే ప్రభుత్వాలు అమలు చేయాల్సిందేనని వారు కోరారు. టి ప్రవీణ్, సుబ్రహ్మణ్యం, రవీందర్, వినోద్, యాదగిరి, శ్రీనివాస్, రవి, రాజేందర్‌రెడ్డి, శివకుమార్, పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

లాండ్రీ షాపులో షార్ట్‌సర్క్యూట్



కాలిపోయిన లాండ్రిషాపు



షాపును పరిశీలిస్తున్న సత్యనారాయణచారి

- కాలిపోయిన దుస్తులు, విద్యుత్ పరికరాలు, సామగ్రి
- బాధితుడిని పరామర్శించిన ఎంపీటీసీ సత్యనారాయణ చారి

చేవెళ్ల: ప్రమాదవశాత్తు లాండ్రి షాపులో షార్టు సర్క్యూట్ జరిగింది. ఈ సంఘటన చేవెళ్ల మండలంలోని పామెన గ్రామంలో చోటు చేసుకుంది. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పామెన గ్రామానికి చెందిన చాకలి శంకరయ్య గ్రామంలోనే లాండ్రి షాపు నిర్వహిస్తూ జీవిస్తున్నాడు. గురువారం ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగడంతో షాపులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీన్ని గమనించిన స్థానికులు మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అప్పటికే షాపులో ఉన్న ఇస్త్రీ బట్టలు, ఫర్నీచర్ కాలిపోయాయి. అయితే ఆ సమయంలో షాపులో ఎవరు లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది.

ఎంపీటీసీ పరామర్శ..

గ్రామంలో షాపు కాలిపోయినట్లు తెలియడంతో ఎంపీటీసీ సత్యనారాయణ చారి అక్కడికి వెళ్లి లాండ్రిషాపును పరిశీలించారు. బాధితునికి ధైర్యం చెప్పి మంటల్లో కాలిపోయిన ఫర్నీచర్‌ను తన సొంత ఖర్చులతో ఇప్పిస్తానని హామీ ఇచ్చారు.

రాణిస్తేనే ఉజ్వల భవిష్యత్



స్వపరిపాలన దినోత్సవంలో ఉపాధాయ్యులుగా వ్యవహరించిన విద్యార్థులు

- ప్రధానోపాధ్యాయురాలు రేణుక
- అమ్డాపూర్‌లో స్వపరిపాలన దినోత్సవం

మొయినాబాద్‌రూరల్: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని అమ్డాపూర్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రేణుక అన్నారు. గురువారం అమ్డాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో స్వపరిపాలన దినోత్సం నిర్వహించారు. పదోతరగతి విద్యార్థులు ఒక్కరోజు ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు రేణుక మాట్లాడుతూ విద్యార్థులు ధైర్య సాహసాలతో ముందుకు వెళ్లినప్పుడే ఉన్నత స్థాయికి ఎదుగుతారన్నారు. ఉపాధ్యాయులకు అన్ని రంగాల్లో అవగాహన ఉంటేనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించగలుగుతామని తెలిపారు.

అక్క దగ్గరకు వెళ్తున్నానని..



రాజు (ఫైల్)

మొయినాబాద్: అక్క దగ్గరకు వెళ్లొస్తానని ఇంటినుంచి వెళ్లిన వ్యక్తి తిరిగి రాలేదు. ఈ సంఘటన మొయినాబాద్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్‌కు చెందిన బైండ్ల రాజు ఈ నెల 8న జీడిమెట్లలోని సూరారంలో ఉండే తన అక్క వద్దకు వెళ్లాడు. 11న తిరిగి ఇంటికొచ్చేందుకు బయలుదేరాడు. కానీ అతను మొయినాబాద్‌కు చేరకపోవడంతో భార్య హంసమ్మ ఆందోళనతో అతనికి ఫోన్ చేసింది. ఫోన్ ఎత్తి ఇంటికి వస్తున్నానే చెప్పాడు. నేటికి అతను ఇల్లు చేరలేదు. ఆందోళన చెందుతున్న కుటుంబ సభ్యులు 13వ తేదీ వరకూ అతని ఫోన్ రింగ్ అయ్యిందని చెప్పారు. ఆ తరువాత ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వస్తుందని పోలీసుల ఫిర్యాదులో వారు పేర్కొన్నారు. దీంతో కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభ్యంకాలేదు. ఏమి చేయాలో అర్థం కాక ఆమె మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు తెలిపారు.

ఘనంగా గ్యార్మీ పండుగ

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో గురువారం జిల్లా మైనార్టీ నాయకుడు సయ్యద్ ఖలీల్ ఆధ్వర్యంలో గ్యార్మీ పండుగను ముస్లింలు భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. వేడుకల్లో భాగంగా స్థానిక మౌలాలి పహడ్ దర్గా సమీపంలో గౌసేపాక్ చిల్లా వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ముస్లిం మతగురువు హజ్రత్ సయ్యద్ జిలానీపాషా ఖాద్రీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకుముందు పట్టణంలో ముస్లింలతో కలిసి గ్యార్మీ షరీఫ్ జెండాను ప్రధాన వీధుల్లో ఊరేగించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు, దువా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సయ్యద్ ఖలీల్ నివాసంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వేడుకల్లో రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ తోట గిరియాదవ్, మతగురువులు మౌలానా అబ్దుల్ ఖరీం, అబ్దుల్ వాహేబ్, ముస్లింలు పాల్గొన్నారు.



దర్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

చదువుతోపాటు క్రీడలు అవసరం

శంషాబాద్: విద్యాసంస్థల్లో చదువుతో పాటు క్రీడలు సమాంతరంగా నిర్వహించాలని బ్యాడ్మింటన్ జాతీయ క్రీడాకారిణి నవ్యరావు అన్నారు. ఎస్‌ఈపీ మిషన్ హైస్కూల్ వార్షికోత్సవ వేడుకలను గురువారం వైఎస్‌ఆర్ గార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. క్రీడలు ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేస్తాయని, విద్యార్థుల అభిరుచికి అనుగుణంగా ఆటలపోటీలు నిర్వహించాలన్నారు. ప్రిన్సిపాల్ ప్రియాంక, ప్రధాన కార్యదర్శి ఆనంద్, మోర్ట్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ శ్రీనివాస్, కౌన్సిలర్ జహంగీర్‌ఖాన్, బీఆర్ఎస్ నాయకులు తదితరులున్నారు.



జ్ఞాపికను అందజేస్తున్న ప్రిన్సిపల్ ప్రియాంక

ప్రతి ఒక్కరికి ఓటరు స్లిప్పులు

మైలార్‌దేవ్‌పల్లి: ఇంటింటికి తిరిగి ప్రతి ఒక్కరికి ఓటరు స్లిప్‌లు అందించాలని రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవికుమార్ తెలిపారు. మైలార్‌దేవ్‌పల్లి, రాజేంద్రనగర్ డివిజన్‌లలోని కాలనీలలో ప్రజలకు డీఎల్‌ఓలతో ప్రతి ఒక్కరికి ఓటరుస్లిప్‌లు అందజేసిన వారిని ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా సర్కిల్ డీసీ రవికుమార్ మాట్లాడుతూ.. గురువారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని ఆదర్శనగర్ ఇళ్లలోని ప్రజలకు ఓటరు స్లిప్‌లు అందించడంపై తనిఖీ చేశామన్నారు. ఓటువేసే సమయంలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోకుండా చూడాలన్నారు. అందుబాటులో లేని వారు జీహెచ్ఎంసీ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం వారం రోజులపాటు నిర్వహిస్తున్నామని వివరించారు. డీఆర్‌డీఓ ప్రభాకర్, డీపీఓ రాధారాణి, సీఓ విజేందర్ తదితరులున్నారు.



ఆకస్మిక తనిఖీ చేస్తున్న రాజేంద్రనగర్ డిప్యూటీ కమిషనర్ రవికుమార్

‘మత్తు’ రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్టు

- రూ.7లక్షల విలువ చేసే 750 గ్రాముల ఎన్‌డీపీఎస్, ద్విచక్ర వాహనం సీజ్
- ఎక్సైజ్ సీఐ అంజనీకుమార్ వెల్లడి

షాద్‌నగర్‌రూరల్: ద్విచక్ర వాహనంపై అక్రమంగా తరలిస్తున్న మత్తు పదార్థాన్ని గురువారం సాయంత్రం టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సీఐ అంజనీకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పాండుగౌడ్ అనే వ్యక్తి షాద్‌నగర్ నుంచి నాగులపల్లి గ్రామం వైపు ద్విచక్రవాహనంపై 750 గ్రాముల ఎన్‌డీపీఎస్ అనే మత్తు పదార్థాన్ని అక్రమంగా రవాణా చేస్తున్నాడు. విశ్వాసనీయ సమాచారం మేరకు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో రాష్ట్ర, జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు తనిఖీలు చేశారు. మత్తు పదార్థాన్ని రవాణా చేస్తున్న పాండుగౌడ్ వాహనాన్ని వారు తనిఖీ చేశారు. ఈ తనిఖీలో అతని వద్ద ఉన్న మత్తు పదార్థాన్ని, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుణ్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ సీఐ అంజనీకుమార్ తెలిపారు. స్వాధీనం చేసుకున్న మత్తు పదార్థం విలువ సుమారు రూ.7.50లక్షలు ఉంటుందని తెలిపారు.



పోలీసుల అదుపులో నిందితుడు

లోపించిన నిఘా..!

- మాల్ మార్కెట్‌కు భద్రత కరువు
- సులువుగా తప్పించుకుంటున్న దొంగలు
- నిఘాలేక జోరుగా బ్లాక్ దందా
- ప్రత్యేక పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్



మాల్ మార్కెట్

యాచారం: నిత్యం వేలాది మంది వినియోగదారులతో రద్దీగా ఉండే మాల్ మార్కెట్‌లో నిఘా కరువైంది. నాగార్జునసాగర్-హైదరాబాద్ రహదారిపై రంగారెడ్డి, నల్గొండ జిల్లాల సరిహద్దులో మాల్ మార్కెట్ ఉంది. వ్యాపార పరంగా దినదినాభివృద్ధి చెందుతోంది. ఇక్కడ క్రయ, విక్రయాలు జోరుగా సాగుతుంటాయి. రూ. కోట్లలో లావాదేవీలు జరుగుతుంటాయి. రూ.కోట్లు తెచ్చి పెడుతున్న మార్కెట్‌లో రక్షణ లేకుండా పోయింది. మాల్ కేంద్రంలో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని స్థానికులతో పాటు వినియోగదారులు వేడుకుంటున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

దొంగలకు రాచమార్గం

రంగారెడ్డి, నల్గొండ జిల్లాల సరిహద్దులో మార్కెట్ ఉండడంతో చోరీలకు పాల్పడుతున్న దొంగలు సులభంగా తప్పించుకుంటున్నారు. దొంగలు ఓ మండల పరిధిలో చోరీలు చేస్తూ మరో మండలంలోకి జారుకుంటున్నారు. ఏ మండల పోలీసులకు ఫిర్యాదు చేయాలో తెలియక బాధితులు నష్టపోతున్నారు. మార్కెట్‌కు రంగారెడ్డి జిల్లాలోని యాచారం పోలీస్‌స్టేషన్ 9 కిలోమీటర్లు, నల్గొండ జిల్లాలోని మర్రిగూడ మండల పోలీస్‌స్టేషన్ 15 కిలోమీటర్లు, చింతపల్లి పోలీస్ స్టేషన్ 20 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఆయా పోలీస్‌స్టేషన్లలో మొబైల్ వాహనాలు ఉన్న సరైన సమయంలో అందుబాటులో ఉండవు.

జోరుగా బ్లాక్ దందా

నిఘా లేకపోవడంతో బ్లాక్ మార్కెట్‌కు మాల్ వ్యాపార కేంద్రం అడ్డాగా మారింది. పోలీసులు చూసిచూడనట్లు వ్యవహరిస్తుండడంతో అక్రమార్కులకు వరంగా మారింది. రేషన్ బియ్యం కొనుగోళ్లు, బెల్లం అమ్మకాలు, గ్యాస్ సిలిండర్ల బ్లాక్ మార్కెట్, నకిలీ వైద్యం, హోటల్లో మద్యం అమ్మకాలు, నకిలీ విత్తనాలు, ఎరువులు ఇలా మార్కెట్లో బ్లాక్ దందా జోరుగా సాగుతుంటుంది. ప్రతి మంగళవారం జరిగే పశువుల సంత, అంగడి జరుగుతుంది. ఆ రోజు బ్లాక్ దందాకు అడ్డూ అదుపు లేకుండా పోతోందని వినియోగదారులు వాపోతున్నారు.

వైఎస్సార్ హయంలో...

దివంగత ముఖ్యమంత్రి వైయస్సార్ హయాంలో మాల్ కేంద్రంలో ప్రత్యేక పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అప్పట్లో హోంమంత్రిగా ఉన్న జానారెడ్డి సీఎంతో మాట్లాడి ప్రత్యేక పోలీస్ స్టేషన్ నిర్మాణానికి అనువైన స్థలాలను పరిశీలించారు. వైయస్సార్ ఆకాల మృతితో పోలీస్ స్టేషన్ ఏర్పాటు కలగానే మిగిలిపోయిందని స్థానికులు వాపోతున్నారు.

జానారెడ్డి దృష్టికి తీసుకెళ్లా...



రెండు జిల్లాల సరిహద్దులో ఉన్న మాల్‌లో ప్రత్యేక పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని వైయస్సార్ హయాంలో అప్పటి హోం మంత్రి జానారెడ్డి దృష్టికి తీసుకెళ్లాను. స్థలాన్ని ఎంపిక చేయాలని రెండు జిల్లాల అధికారులను ఆదేశించారు. పోలీస్‌స్టేషన్ ఏర్పాటు అవుతుందని సంతోషించాం. కానీ సాధ్యం కాలేదు.

– రాంరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ, యాచారం

స్థలం కేటాయిస్తాం



మాల్ వ్యాపార కేంద్రంలో చోరీలకు పాల్పడుతున్న దొంగలు సులువుగా తప్పించుకుంటున్నారు. ఓ మండలంలో చోరీ చేసి పక్కనే ఉన్న మండలంలోకి వెళ్లిపోతున్నారు. ఏ పోలీసులకు ఫిర్యాదులు చేయాలో తెలియక బాధితులు గందరగోళంలో ఉన్నారు. నా దృష్టికి పలు ఫిర్యాదులు వచ్చాయి. మాల్‌లో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తే స్థలాన్ని కేటాయిస్తాం.

– పడకంటి కవిత, సర్పంచ్, మాల్ గ్రామం